నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | అక్టోబర్ 05 2024 | www.navatelangana.com

తప్పుడు పత్రాలతో పాస్‌పోర్ట్..

- ఢిల్లీ పోలీసుల అదుపులో ఇద్దరు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటకు చెందిన వాహబ్ మహమ్మద్ తప్పుడు ధ్రువ పాత్రలతో హసేన్ అబ్దుల్‌గా మార్చుకొని పాస్‌పోర్ట్ పొందినట్టు సమాచారం. వాహబ్ మహమ్మద్ పేరుపై గతంలో సౌదీకి వెళ్లగా కేసు నమోదు కావడంతో ఇండియాకు పంపించారు. తిరిగి హసేన్ అబ్దుల్‌గా వెళ్లగా అక్కడి ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడడంతో, తిరిగి ఇండియాకు పంపి, ఇండియా ఇమిగ్రేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరపగా రెడ్డిపేట పరిధిలోని జగదాంబ తండా మాజీ ఉపసర్పంచ్ శంకర్ నాయక్ సహకారంతో కామారెడ్డి లోని ఓ జిరాక్స్ సెంటర్ ఆధ్వర్యంలో రెండవ పాస్‌పోర్ట్ పొందినట్లు తెలపడంతో, శంకర్ నాయక్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోగా, జిరాక్స్ సెంటర్ యాజమాని పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

కొరియర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్



టీఎస్ ఆర్టీసీ ద్వారా జిల్లా నుంచి రాష్ట్ర నలుమూలలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రలకు ఆర్టీసీ బస్సు ద్వారా అందించే కొరియర్ ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో తోటి సిబ్బందితో కలిసి కొరియర్ సేవలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ సేవ నిర్వాహకులు మ్యాక నర్సయ్య, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

26,27న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు

- జయప్రదం చేయండి :
  పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్టోబర్ 26, 27 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీపీఐ(ఎం) నిర్మాణ కర్తవ్యాల్లో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుండి అఖిలభారత స్థాయి వరకు పార్టీ మహాసభలు నిర్వహించుకొని నూతన కమిటీలను ఎన్నుకుంటామని, అందులో భాగంగా సెప్టెంబర్ నెలలో గ్రామ శాఖ మహాసభలు నిర్వహించినట్టు తెలిపారు. జిల్లాలోని గ్రామ శాఖ మహాసభలు ఇప్పటికే పూర్తయ్యాయని, ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు ఏరియా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈనెల 26, 27 తేదీలలో జిల్లా మహాసభలు నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. 26వ తేదీన జిల్లా మహాసభల సందర్భంగా బహిరంగ సభ ఉంటుందని, అనంతరం పార్టీ ప్రతినిధులతో మహాసభ కొనసాగుతుందని, 27వ తేదీ సాయంత్రం నూతన కమిటీని ఎన్నుకోవడం ద్వారా మహాసభ ముగుస్తుందని తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్ర నాయకులు ఎస్ వీరయ్య, జ్యోతి, పాలడుగు భాస్కర్, ఎస్ రమ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మహాసభలకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటివరకు చేసిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలపై చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వై. గంగాధర్, సుజాత, జంగం గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నీళ్లల్లో కొట్టుకుపోయేవాళ్లం

- హెచ్చరిక లేకుండా ఎస్సారెస్పీ నీటి విడుదలపై మత్స్యకారుల ఆగ్రహం, ఆందోళన

నవతెలంగాణ-బాల్కొండ



ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

ముందస్తు హెచ్చరిక లేకుండా వరద కాలువ నీటి విడుదల చేయడంతో కాలువలో కొట్టుకుపోయే వాళ్లమని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ఇందిరమ్మ వరద కాలువ ద్వారా నీటి విడుదలను గురువారం అధికారులు నిలిపివేశారని దీంతో చేపల వేట కోసం శుక్రవారం వన్నెల్(బి) గ్రామ మత్స్యకారులు కాలువలో వలలు వేసినట్టు తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ముందస్తుగా ఎటువంటి సమాచారం, హెచ్చరిక లేకుండా శుక్రవారం వరద కాలువ ద్వారా నీటిని వదిలారని, అధికారుల నిర్లక్ష్యంతో తాము నీటి ప్రవాహానికి కొట్టుకుపోయేవారమని ఆందోళన చెందారు. వరద కాలువలో వేసిన వలలు నీటి ప్రవాహానికి కొట్టుకపోయాయని దానితో ఒక్కొక్క మత్సకారునికి సుమారు 20 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు మత్స్యకారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. నిరసనలో మత్స్యకారులు ఉషాన్న, శ్రీనివాస్, రాజశేఖర్ దేవిదాస్, నిరంజన్, కిషోర్, నరేష్, శివాకేశవ్, దేవేందర్, గంగాధర్, దేవరాజ్, ప్రతీప్, సత్యనారాయణ,రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతో కార్యకర్తకు పీసీసీ పీఠం

- కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు
- డీఎస్ రాజకీయ గురువు.. మన మధ్య లేకపోవడం బాధాకరం
- దేవుళ్ల పేరుతో రాజకీయం చేయబోం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్
- పదవి చేపట్టి తొలిసారి జిల్లాకు రాక.. ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్



ర్యాలీలో అభివాదం చేస్తూ..

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన వ్యక్తిని. కార్యకర్త స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీలో నా ప్రస్థానం ప్రారంభమైంది. కార్యకర్తకు సైతం పీసీసీ పీఠం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంది. కష్టపడ్డ కార్యకర్తలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తించుకుంటుంది. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు. భవిష్యత్తు మనదే. అందిరికి గుర్తింపు ఉంటుంది' అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ పదవి పొంది తన సొంత జిల్లా అయిన నిజామాబాద్‌కు తొలిసారి శుక్రవారం రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ముందుగా మధ్యాహ్నం మాధవనగర్‌కు చేరుకొని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన ర్యాలీ.. పాత కలెక్టరేట్ వరకు కొనసాగింది. దారి పొడవునా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పూలు జల్లుతు, క్రేన్‌తో గజమాల వేస్తూ స్వాగతం పలికారు. సన్మాన సభ కార్యక్రమం పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ 'నాగన్న చెరువు గ్రామం నుంచి ఢిల్లీ వరకు ప్రయాణం ఎప్పుడైనా ఊహించారా నేను నాగన్న చెరువు అనే చిన్న గ్రామం నుంచి పిసిసి అధ్యక్షునిగా ఎదిగాను. డీఎస్‌తో నాకు విభేదాలు ఉన్నప్పటికీ ఆయన నాకు రాజకీయ గురువు. జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షునిగా నాకు అవకాశం ఇచ్చారు. ఇవాళ డీఎస్ మన మధ్య లేకపోవటం బాధాకరం'.

'2014లో ఏ మాటలు చెప్పి మోడీ అధికారంలోకి వచ్చారు. మా ఇంట్లో మేము కూడా పూజ చేస్తాం. మేము ఎప్పుడు దేవుళ్ళ పేరు చెప్పి రాజకీయం చేయలేదు. శ్రీరామునికి బిజెపికి సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. మతాల పేరిట, కులాల పేరిట జీవితాలను నాశనం చేసుకోవద్దు'.

'పదేళ్ల కాలంలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడు. ప్రతి ఒక్క దానికి లెక్క చెప్పాల్సిందేనని కేసీఆర్‌ను నిలదీశారు. అక్రమ సంపాదనతో ఫామ్ హౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నాడు. ఇప్పటి వరకు కేసీఆర్ ప్రజల్లోకి రావటం లేదు. ఇవాళ కాంగ్రెస్ అధికారంలో ఉందంటే ప్రజలు, కార్యకర్తలే కారణం అని గుర్తు చేశారు. అధికారంలో పదేళ్లు ఖచ్చితంగా ఉంటుంది. పదవులు ఎప్పటికి శాశ్వతం కావని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరిదీ, రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా ముందుకు వెళ్తాం అని తెలియజేశారు. కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, భవిష్యత్తు కార్యకర్తలదే అని అన్నారు.

నిజామాబాద్‌లో రంజీట్రోఫీ ఆడాను : అజారుద్దీన్

తాను రంజీ ట్రోఫీలో అడుగుపెట్టిన రెండో మ్యాచ్ నిజామాబాద్‌లోనే ఆడానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఇండియన్ క్రికెటర్ అజారుద్దీన్ గుర్తుచేశారు. తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి క్రీడల్లో ప్రావీణ్యులమయ్యామన్నారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, వి హనుమంతరావు, జీవన్ రెడ్డి, ఆయా శాఖల చైర్మన్లు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, ఆశ్రాఫ్, గంగారెడ్డి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





మర్కల్ వద్ద స్వాగతం పలికిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు.. నగరంలో భారీ ర్యాలీ

నాకు రాజకీయ భిక్ష పెట్టింది నిజామాబాద్ జిల్లా ప్రజలు : మధుయాష్కీ

నాకు రాజకీయ భిక్ష పెట్టి మరో జన్మనిచ్చిన నిజామాబాద్ జిల్లా ప్రజలను జీవిత కాలం గుర్తు పెట్టుకుంటానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్వాగత సభలో ఆయన మాట్లాడారు. గతంలో నిజామాబాద్ జిల్లా నుంచి డి.శ్రీనివాస్ రెండు సార్లు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ జిల్లా నుంచి ఎదిగిన మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ మరెన్నో పదవులు అధిరోహించాలని కోరుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలకు మాత్రమే ఈ అవకాశాన్ని ఇస్తుందని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం నిర్మించాలని విన్నవించారు. తన వంతుగా రూ. 5లక్షలు అందజేస్తానని మధుయాష్కీ ప్రకటించారు.

సీలింగ్ లేకుండా సోయాను ప్రభుత్వమే కొనాలి

- అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలి
- మంత్రుల రివ్యూకు రావొద్దనే ఆలస్యంగా సమాచారం : మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎకరాకు 6 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామనే సీలింగ్ లేకుండా పండిన మొత్తం సోయా పంటను ప్రభుత్వమే ఎమ్మెస్పీ ధరకు కొనుగోలు చేసి రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో మంత్రుల రివ్యూ మీటింగ్ ఉంటే తాను మీటింగ్‌రావొద్దనే ఉద్దేశ్యంతో శుక్రవారమే సమాచారం ఇచ్చారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వమే సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంట కొనుగోలు చేయాలని గత వారం తాను డిమాండ్ చేసిన సంగతిని గుర్తు చేశారు. తదనంతరం ప్రభుత్వం మొక్కుబడిగా మాత్రమే కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఎకరానికి 10 నుండి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే ప్రభుత్వం ఎకరానికి 6 క్వింటాళ్ల మట్టుకు మాత్రమే తీసుకుంటామంటుందని తెలిపారు. మిగతా పంటను అమ్ముకోవాలంటే రైతులు మళ్ళీ ప్రైవేట్ వ్యాపారుల చుట్టూ తిరిగి క్వింటాలుకు 4300 రూపాయలకే అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో 1,30,000 ఎకరాలలో సోయా పంట పండుతుందని అందులో కామారెడ్డి 90 వేలు, నిజమాబాద్ 40 వేలు ఎకరాలు రైతులు సాగు చేశారన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

ప్రజాపాలనలో పండుగ పూట కార్మికులు పస్తులేనా?


వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని, ప్రజా పాలనలో పండగ పూట కార్మికులు పస్తులు ఉండాలా అని నిజామాబాద్ సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రశ్నించారు. ప్రజలందరూ నిర్వహించుకునే అత్యంత ముఖ్యమైన బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశాలకు సెప్టెంబర్ నెల పారితోషికాలు, లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని బకాయి వేతనాలు ఇవ్వాలని శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. గత రెండు నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ప్రతినెలా పారితోషికాలను నెల చివరి తేదీన చెల్లించిందని, ఇదే పద్ధతిలో సెప్టెంబర్ నెల పారితోషికాలు కూడా సెప్టెంబర్ నెల చివరి తేదీన అకౌంట్లో పడతాయని ఆశాలు ఆశించినట్టు తెలిపారు. కానీ సెప్టెంబర్ నెల చివరి తేదీ దాటి మూడు రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ పారితోషికాలు రాకపోవడంతో ఆశాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బతుకమ్మ, దసరా పండుగను ఇంటిల్లిపాది నిర్వహించుకుంటుందని, ఇలాంటి సమయంలో పారితోషికాలు సకాలంలో రాకపోవడం వల్ల వారు పండుగను సంతోషంగా నిర్వహించుకునే అవకాశం లేదని తెలిపారు. సెప్టెంబర్ నెల పారితోషికాలతో పాటు 2023, 2024 రెండు సంవత్సరాల లెప్రసీ సర్వే, 2024లో చేసిన పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు మొత్తం చెల్లించి ఆశాలను రాష్ట్ర ప్రభుత్వం పండుగల సందర్భంగా ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లలిత, శోభ, పర్వియన్ పాల్గొన్నారు.

ఇంటర్‌సిటీ ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభిస్తున్న మంత్రి

ఇంటర్‌సిటీ ఎలక్ట్రికల్ బస్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. నిజామాబాదు రీజియన్‌కు కేటాయించిన మొత్తం 64 ఎలక్ట్రిసిటీ బస్సులలో తొలి విడత 13 బస్సులు సరఫరా కాగా నిజామాబాద్ బస్టాండ్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి జేబీఎస్, నిజామాబాద్ నుంచి బాన్సువాడ, అదే విధంగా మెదక్, నిర్మల్, వరంగల్‌కు, కామారెడ్డి, ఆదిలాబాద్‌కు నడుపనున్నట్టు అధికారులు తెలిపారు.

దసరా కానుకగా 'డబుల్' ఇండ్లు

- ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 3500 నుండి 4000 ఇందిరమ్మ ఇండ్లు
- దేశానికి ఆదర్శంగా నిలువనున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖతో కలిసి జిల్లా ప్రగతిపై సమీక్ష
- ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా పరిరక్షించాలని అధికారులకు ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

దసరా కానుకగా.. ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు కేటాయించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి పర్యవేక్షణలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుందని అన్నారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, శానిటేషన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, ఈ పనుల కోసం అవసరమైన నిధులను కూడా కేటాయించనున్నట్టు తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్న అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా రెండుమూడు నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే నిరుపేదల రాజ్యం అని స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి, అర్హులైన వారికి తొలి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ప్రభుత్వం త్వరలోనే 3500 నుండి 4000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుందని ప్రకటించారు.

నిజామాబాద్ జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు - భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ శుక్రవారం సమీక్ష జరిపారు. ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న మంత్రులకు హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా, జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల ప్రగతి, ఎల్.ఆర్.ఎస్, విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరు, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ సర్వే తదితర అంశాల అమలు తీరు గురించి కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్కో అంశం వారీగా వివరాలను అడిగి తెలుసుకుంటూ, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ధరణి దరఖాస్తులను పరిష్కరించే విషయంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపడం ప్రశంసనీయమని ప్రభుత్వం పక్షాన అభినందనలు తెలియజేశారు. అయితే, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి కూడా ఇదే తరహాలో చొరవ చూపుతూ, వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

ధరణి స్థానంలో సమగ్రంగా ఆర్వోఆర్ చట్టం

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రైతులు అభద్రతా భావానికి గురి కావాల్సి వచ్చిందని మంత్రి పొంగులేటి ఆక్షేపించారు. ధరణి ఇబ్బందులను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని సంప్రదించి, మేధావులు, నిపుణుల అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని సమగ్రంగా నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని రూపొందించినట్టు తెలిపారు. ఈ నెలాఖరులోపు అమలులోకి రానున్న నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం యావత్ దేశానికే ఆదర్శంగా నిలువబోతోందని అన్నారు. రెవెన్యూ చట్టాలలో మార్పులు చేయాలనుకునే ఇతర రాష్ట్రాలకు కొత్త ఆర్.ఓ.ఆర్ యాక్టు ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా ఉపకరిస్తుందని వ్యాఖ్యానిం చారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జాకానీయొద్దు

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నందున, వీటి పనితీరును మెరుగుపరుచుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని హితవు పలికారు. విద్య, వైద్య శాఖల్లో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున తక్షణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆలోపు కాంట్రాక్టు పద్ధతిన డాక్టర్లను నియమించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 637 కోట్ల నిధులను ఖర్చు చేసిందని వివరించారు. కాగా, ఎక్కడ కూడా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. కబ్జాలకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా సరే, వారి నుండి సర్కారు భూములను స్వాధీనం చేసుకుని వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డే ప్రామాణికం

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. వచ్చే జనవరి నెల నుండి రేషన్ షాపుల ద్వారా అందించనున్న సన్న బియ్యం పంపిణీతో పాటు, ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత విద్యుత్, రూ. 500 లకు వంట గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి అన్ని పథకాలకు భవిష్యత్తులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రామాణికంగా నిలుస్తుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటిని పరిష్కరిస్తూ అందరికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రూపొందించబడిన డిజిటల్ కార్డులను అందిస్తామని వెల్లడించారు. నిరుపేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తమ ప్రభుత్వానికి ప్రతిపక్షాలు విలువైన సూచనలు అందిస్తూ పాలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, ఎస్.కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ ఫ్యామిలీ సర్వే పరిశీలన

నవతెలంగాణ-బాల్కొండ

డిజిటల్ ఫామిలీ సర్వే పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన మండల పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ పరిశీలించారు. గ్రామంలో గురువారం ప్రారంభమైన సర్వే రెండు రోజుల్లో 150 కుటుంబాల వివరాలు నమోదు చేశామని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎంపీఓ గంగ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణ, ఆర్ ఐ భరత్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.


డిజిటల్ ఫ్యామిలీ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నిరుద్యోగ యువతకు ఉపాధి

- సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్

నవతెలంగా-ఆర్మూర్

పట్టణంలోని సాయి టెక్నికల్ ఇన్నిట్యూట్ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తూ 100శాతం ప్లేస్మెంట్ ఇస్తున్నట్టు కరస్పాండెంట్ జక్కుల రాజేందర్ యాదవ్ శుక్రవారం తెలిపారు. తమ ఇనిస్టిట్యూట్లో మెకానిక్, ఎలక్ట్రికల్ రెండు నెలల కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గుర్తింపుగల సర్టిఫికెట్ సైతం గతంలో అందజేసినట్టు తెలిపారు. పట్టణంతో పాటు నిర్మల్, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాలలోని పలు గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణ పొంది ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నట్టు తెలిపారు.


మాట్లాడుతున్న కరస్పాండెంట్

టీచర్లకు బోధన మెళకువలపై శిక్షణ


ఎంవీఐని సన్మానిస్తున్న పాఠశాలల అసోషియేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్లోని చాందినీ బాంకెట్ హాల్లో మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందానికి మారుతున్న కాలానికి అనుగుణంగా, రాబోయే తరానికి అవసరమయ్యే బోధనా పద్ధతులు, మెళకువలపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వివేకానంద రెడ్డి పాల్గొని ట్రాఫిక్ నియమ నిబంధనల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీణ్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, శ్రీ భాషిత సుందర్, శ్రీ మోడల్ మల్లేష్, నలందా సాగర్, మానస గణేష్, వంశి ప్రజ్ఞ, కాంతి శశాంక్, ఇతర పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారు?

- ఇరిగేషన్ అధికారులను అడ్డుకున్న బైరాపూర్ గ్రామస్తులు
- ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే సరైన హామీ ఇప్పించాలి


నిలదీస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో శివారులోని భైరాపూర్ 21 ప్యాకేజీ పంప్ హౌస్ సర్వే చేయడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. తమకి ఎటువంటి సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారని మండిపడ్డారు గతంలో ప్రతిపక్షంలో ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న భూపతి రెడ్డి అప్పుడు రైతులు చేస్తున్న ఉద్యమానికి అండగా నిలబడ్డారని, ఇప్పుడు ప్రాజెక్టు డిజైన్పై ఎటువంటి సమాచారం లేకుండా అధికారులను ఎలా వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డి ఈ వచ్చిన రైతులు వినకపోవడంతో అధికారులు సర్వే చేయకుండా వెనుదిరిగారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు మాట్లాడుతూ మాకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి సరియైన హామీ ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని కోరారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ సుచరిత రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ లో శుక్రవారం నాడు పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ సుచరిత రెడ్డి దేవి శరన్న రాత్రులు పురస్కరించుకొని దుర్గామాతలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దుర్గాదేవి మండపాలకు చీరలను కానుకగా పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదశ్యమైనట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రఘుపతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని అశోక్ నగర్ కాలనీకి చెందిన గజ్జల అనురాధ పెద్ద కూతురు అక్షయ (20) డిగ్రీ చదువుతున్నది. గత నెల 29న ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్ళిపోయింది. తన కూతురు గురించి బంధువుల వద్ద చుట్టుపక్కల వెతికిన జాడ దొరకలేదు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇచ్చారు. ఈ విషయంపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ రఘుపతి వివరించారు.



అక్షయ (ఫైల్)

6న బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ ధ్యాన బంధువుల సహకారంతో, పిఎస్ఎస్ఎం నవనాథపురం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ధ్యాన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్టు పిఎస్ఎస్ఎమ్ జిల్లా అధ్యక్షులు, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి

- డివిజనల్ ఫారెస్ట్ అధికారి భవాని శంకర్

నవతెలంగాణ-ఆర్మూర్/ నిజామాబాద్ రూరల్

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలని డివిజనల్ ఫారెస్ట్ అధికారి భవాని శంకర్ అన్నారు. 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోని మాక్లూర్ పార్కులో పక్షులను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను వేటాడటం నేరమని, వాటిని వేటాడితే చట్టప్రకారం శిక్షలు ఉంటాయని తెలిపారు. వన్యప్రాణులు అనుకోకుండా జన సంచారంలోకి వస్తే వాటిపై దాడి చేయకుండా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వారువచ్చి వాటిని పట్టుకొని అడవుల్లో వదిలేస్తారని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ అధికారులు అశోక్, సుధాకర్, శ్రీదేవి, రణవీర్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: 70వ వన్యప్రాణుల వారోత్సవాలు అక్టోబర్ 1 నుండి 7 వరకు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు దానిలో భాగంగా సారంగాపూర్లోని అర్బన్ పార్క్లో శుక్రవారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ మీర్ ఇర్షత్ ఆలీ మాట్లాడుతూ.. అర్బన్ పార్క్ అభివృద్ధికి నా వంతు శాయ శక్తులా ప్రయత్నం చేస్తానని ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్ గౌడ్ కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనుచరులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సాయిలు, సారంగాపూర్ బిఎడ్ కాలేజ్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.కరుణాకర్, డాక్టర్ వి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ జనార్ధన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


ఆర్మూర్: పార్కులో పక్షులను వీక్షిస్తున్న ఫారెస్టు అధికారులు, సిబ్బంది


నిజామాబాద్ రూరల్: మొక్కను నాటుతున్న ఫారెస్టు అధికారి

సీఎంతో తాడోపేడో తేల్చుకుంటాం

- 9న నల్ల జెండాల ప్రదర్శనను విజయవంతం చెయ్యాలి
- ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం అన్యాయమని, నిండు అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట మార్చడం సీఎం రేవంత్ రెడ్డికి తగదని, సీఎం రేవంత్ రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పోశెట్టి, ప్రమోద్ మాదిగ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చుని ఆగస్టు 1 న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కమిటీల పేరిట కాలయాపన చేస్తూ సీఎం రేవంత్రెడ్డి మాదిగలను వంచిస్తున్నాడని అన్నారు. మాదిగలను డీఎస్సీ ఫలితాలలో విస్మరించినందుకు నిరసనగా ఈనెల 9న డీఎస్సీ ఉద్యోగస్తులకు నియామక పత్రాలు అందజేస్తున్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాదిగల నల్ల జెండాల ప్రదర్శన చేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ విషయం మీద జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్పి జాతీయ నాయకులు మానికొల్ల గంగాధర్ మాదిగ, ఎంఎస్పిజిల్లా నాయకులు మైలారం బాలు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షుడు మంద ప్రభాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మందరణ మారుతీ నాగం రాజేష్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున మాదిగ, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు పద్మ, ఎంఎస్పి జిల్లా నాయకులు యాదశి శ్రీ రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కరే పోచిరాం మాదిగ, తదితరులు పాల్గొన్నారు.


వాల్పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

డీజే నిర్వాహకునిపై కేసు నమోదు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని వన్నెల్ (బి) గ్రామంలో డీజే నిర్వహించిన నిర్వాహకునిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు బాల్కొండ ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. డీజేల నిర్వహణపై ముందస్తు అనుమతి లేకుండా, గ్రామంలో గురువారం రాత్రి డీజే నిర్వహించారన్నారు. సౌండ్ పొల్యూషన్ ద్వారా ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకు డీజే నిర్వాహకునిపై క్రిమినల్ కేసు నమోదు చేసి డీజేను సీజ్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.



రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకయ్యను కలిసిన మేయర్


బొకే అందజేస్తున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించారు.

హిమో షిమోఫిలియా ఉంటే ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్ వాడిలో గల రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం మందిరంలో హిమో షిమోఫిలియాపై అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు దాసరి విజయ ఆనంద్ రావు, రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, డాక్టర్ నీలి రామ్ చందర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఫిజియోథెరపిస్ట్ జగదీష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిమోఫిలియా అనే వ్యాధి రాజవంశం కాలం నుండి వచ్చిందని వారు తెలిపారు. అందుకే ఈ వ్యాధిని రాజవ్యాధి అని కూడా పిలుస్తారని అన్నారు. హిమోఫిలియా వ్యాధి వంశపార్యపరంగా వచ్చే వ్యాధి కాదన్నారు. ఈ వ్యాధి బారిన పడ్డవారికి రక్తం గడ్డకట్టుట లాంటిది జరగదని తెలిపారు. ఈ వ్యాధి చాలా అరుదుగా వస్తుందన్నారు. ఈ వ్యాధి బారిన పడ్డవారు భయాందోళనకు చెందకుండా తమకు అనుకూలంగా ఉన్న వ్యాయామం అలాగే పిల్లలు ఆటలు ఆడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెద్దలు కూడా దెబ్బలు తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. ప్రతి పదివేల మంది మగవారిలో ఒకరికి ఉండగా ఆడవారిలో సుమారు పది లక్షల మందిలో ఒకరికి వ్యాధి ఉంటుందని తెలిపారు. ఈ లెక్కన చూసుకుంటే దేశవ్యాప్తంగా సుమారు లక్ష మంది వ్యాధిగ్రస్తులు ఉండవచ్చునని చెప్పారు. రాష్ట్రంలో ఐదు వేల మంది ఉండవచ్చునని తెలిపారు. ఈ వ్యాధిని నయం చేయడం కష్టమైన పని అయిపోయినప్పటికీ కుటుంబ సభ్యుల మద్దతుతో ఉపశమనం పొందవచ్చని అన్నారు. అయితే రక్తస్రావంతో ఉన్నవారు ఎమోఫిలియా వ్యాధిగ్రస్తుల కాదా తెలుసుకునేందుకు హైదరాబాదులోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కేర్ బంజారా అపోలో హాస్పిటల్స్ లో నిర్వహించబడతాయని వారు తెలిపారు. అవగాహన సదస్సులో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, హిమో ఫీలియా బారిన పడ్డవారు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయ ఆనంద్ రావు

సివిల్ సప్లైస్ హమాలీల బస్తా రేట్లుపెంపు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సివిల్ సప్లైస్ హమాలీల బస్తా రేట్లుపెంచినట్టు సివిల్ సప్లై స్ కార్పొరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై . ఓమయ్య' తెలిపారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై స్ కార్పొరేషన్లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్ల నూతన రేట్లు, వేతనాలు ఈ సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి పెంచి అమలు చేయాలని అన్నారు. అనేకసార్లు పోరాటాలుచేసి సప్లై భవన్ ముట్టడించిన రాష్ట్ర కమిషనర్ చౌహాన్ చర్చలకు ఆహ్వానించారన్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన చర్చలో హమాలీలకు సంబంధించిన కూలి రేట్లు క్వింటాకు 26 రూపాయల నుండి 29 రూపాయలకు పెంచడంతోపాటు దసరా పండుగ సందర్భంగా చెల్లించే బోనస్, స్వీటు, రెండు జతల యూనిఫారం, కుట్టుకూలీలతోపాటు స్వీపర్ల వేతనాలు పెంచారని తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ .దేవేందర్, కోశాధికారి బాజన్న, నాయకులు పవన్ ,వెంకటేష్, రాజశేఖర్, బాబర్, యూనిస్, మోహన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్సిటీ

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్యుని సొంతింటి కల సాకారం కోసం నరేంద్రమోదీ కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశమంతా ఇండ్లు నిర్మించి అర్హులైన పేదలకు ఇస్తున్నారన్నారు. తెలంగాణకు ఆవాస్ యోజన కింద నిధులు కేటాయిస్తే వాటిని పక్కదారి పట్టించిన ఘనత గత ముఖ్యమంత్రి కెసిఆర్ది అన్నారు. నిజామాబాద్ అర్బన్లో గత పదేళ్లనుండి ఒక్క ఇల్లు ఇచ్చిన పాపానపోలేదని అన్నారు సొంతింటి జాగా ఉంటే ఐదు లక్షలు ఇస్తానన్నారని, వాటికీ కూడా దిక్కులేకుండా పోయిందని అన్నారు. అర్బన్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు శిథిలావస్థలో కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయని, డోర్స్, కిటికీలు, ఎలక్ట్రిసిటీ మొత్తం దొంగలు అపహరించారని ప్రజాధనం కోట్ల రూపాయలు వృథా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఎంపిక అర్బన్ లో ఎస్ సి -17శాతం, ఎస్టీ-6శాతం, మైనారిటీ 12శాతం, మిగతా కులాల వారికీ సమానంగా ఎంపిక చేయాలన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ జీ ఓ తుంగలో తొక్కి తన ఇష్టం వచ్చినట్లు పార్టీ నాయకులకు, మైనారిటీల ఓట్ బ్యాంకు కోసం 43శాతం లిస్ట్ ఎంపిక చేసి మిగతా వర్గాలకు అన్యాయం చేశారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మరమ్మతులు చేసి దీపావళి వరకు కేటాయించాలని లేదంటే ప్రజల పక్షాన పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇస్తానన్న ఇందిరమ్మ ఇండ్ల కింద అర్బన్ నియోజకవర్గానికి 7,500 ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్నవారికి కట్టుకోవడానికి 5 లక్షల ఆర్థిక సహాయం కూడా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మురుగున్న చోట దోమల వృద్ధి

నవతెలంగాణ-కమ్మర్పల్లి/ ఆర్మూర్

మండలంలోని నాగాపూర్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చింతరాజ శ్రీనివాస్ పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న చర్యలను ఆయన తనిఖీ చేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యకు సూచించారు. దోమల లార్వాను చంపేందుకు నీటి మడుగుల్లో ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు.

నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా దోమల వృద్ధిని నివారించవచ్చున్నారు. నల్లా నీటి గుంతల్ని కూడా పూడ్చివేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇంట్లోలోనే తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా నిలువ ఉంచి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలన్నారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు మారుతి, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సబ్ యునిట్ అధికారి సాయి సందర్శించి మాట్లాడారు. నీటి నిల్వలు ఉన్నట్లయితే దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జక్కుల మోహన్, జగ్జీవన్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కమ్మర్పల్లి: ఫ్రైడే, డ్రైడే నిర్వహిస్తున్న ఎంపీడీవో, ప్రత్యేక అధికారి

వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్ల నుంచి సుదీర్ఘకాలం పోరాటం చేసి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, మాదిగ ఉప కులాలకు అన్యాయం జరుగుతుందని, రేవంత్‌రెడ్డి తీరుని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణ చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని హితవు పలికారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

నవతెలంగాణ

3

సమగ్ర తెలుగు దినపత్రిక

కామారెడ్డి

శనివారం | అక్టోబర్ 05, 2024 | www.navatelangana.com

5న సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి జే బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 5న శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మద్నూర్ ఆధ్వర్యంలో (మార్క్‌ఫెడ్, నాఫెడ్) ద్వారా సోయా పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు సహకార సంఘం కార్యదర్శి జే బాబురావు శుక్రవారం తెలిపారు. మద్దతు ధర కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవానికి జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హాజరవుతారని తెలిపారు. కొనుగోలు కేంద్రం మద్నూర్ మార్కెట్ యార్డులో ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన ముఖ్యమంత్రి

- సీఎం తీరుపై 9న నిరసన
- ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు సత్తిగాడు లక్ష్మి అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నల్ల జెండాలతో భారీ ప్రదర్శన, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్, ఎంఎస్పి, ఎంఎంఎస్ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కత్తి పద్మారావు, జిల్లా సీనియర్ నాయకులు గరుగళ్ళ బాలరాజు, బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ జి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ తండాలోని చిన్న తండాను జిపిగా ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గోకుల్ తాండ వాసులు

నవతెలంగాణ-రామారెడ్డి

గోకుల్ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించగా, తాండా వాసులతో కలిసి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చిన్న తాండ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, తాండ పెద్దలు తదితరులున్నారు.

నేలకొరిగిన పంటలను పరిశీలించిన నాయకులు



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్, ఊట్‌పల్లి, బెల్లల్, రాజీవ్‌నగర్ తాండా, సంగం, గ్రామ పరిసర ప్రాంతాల్లో గురువారం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు వరి పంట పూర్తిగా నీట మునిగిందని, దాంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. పెట్టుబడి పెట్టి, మరో పదిహేను, ఇరవై రోజులలో పంట చేతికొచ్చే దశలో ఇలా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో పంట పూర్తిగా నీట మునిగిందని రైతులు వారి ఆవేదనను వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే పంటలను పరిశీలించి రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గంగమ్మ గుడి నిర్మాణానికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని పులి చెరువు కట్టపైన గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న గంగమ్మ గుడి ఆలయ అభివృద్ధి పనులకు ఎడపల్లి గ్రామానికి చెందిన కందగట్ల రామచందర్ అనే వ్యక్తి రూ.20వేలను చెక్కు రూపంలో గంగపుత్ర సంఘం పెద్దలకు, యువకులకు ఆయన అందజేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెపూల శ్రీనివాస్, గంగపుత్ర సంఘం పెద్దలు, యువకులు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

నవతెలంగాణ-పిట్లం

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాన్సువాడ రోడ్డులో గల త్రిశూల్ ప్రైవేట్ ఆసుపత్రిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంత పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని సూచించారు. రోగుల పట్ల భారమైన మందులు ట్రీట్మెంట్ కాకుండా సులభతరమైన ఖర్చుతో వైద్య సేవలు అందించాలని అన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, గంగారాం ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొనడంతో ఆస్పత్రి నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌రెడ్డి, బొడ్ల రాజు, చిప్ప శివ, మరగల దయానంద్, మల్లప్ప పటేల్, మొగులగౌడ్, నారాయణఖేడ్, కల్హేర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

'నా ప్లాటు మరొకరికి రిజిస్టర్ చేశారు'

- పంచాయతీ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన అనీషా బేగం గతంలో తాను కొనుగోలు చేసిన ప్లాటును గ్రామ కార్యదర్శి మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని తెలియడంతో ఆమెతో పాటు ఆమె బంధువులు గ్రామపంచాయతీ ఎదుట శుక్రవారం నిరసనకు దిగారు. వివరాలలోకి వెళితే.. నీలా గ్రామం సొసైటీ పక్కనే గల 737/పి2 భూమిలో ప్లాట్ నెంబర్ 20, 21, ఒక్కొక్కటి మూడు లక్షల రూపాయల చొప్పున కొనుగోలు చేసి బాండ్ పేపర్‌పై రాసుకున్నారు. ఈ ప్లాట్‌లను నిజామాబాద్‌కు చెందిన హైమద్ సాదు ఎగ్బాల్ వద్ద కొనుగోలు చేశారు. పేదరాలైన ఆమె కూలీ పనులు చేసుకుంటూ, తన పిల్లల కోసం కష్టపడి ఆరు లక్షల రూపాయలతో ప్లాట్లు కొనగా దాన్లో నుండి ఒక ప్లాట్‌ను ఇదే గ్రామానికి చెందిన మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని బాధితురాలు వాపోయింది. స్టాంప్ పేపర్‌పై రాయించుకున్న తాను గ్రామ కార్యదర్శి రాణి వద్దకు వెళ్లి అడుగగా ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించిందని బాధితురాలు అనీషా బేగం భర్త బషీర్‌లు వాపోయారు. సంబంధిత అధికారులు గ్రామంలోని కేటాయించిన ప్లాట్లపై సమగ్ర విచారణ జరిపించి తమకు తగిన న్యాయం చేయాలని వారు కోరారు. వారి వెంట స్థానికులు సద్దాం, అలిముద్దీన్, గౌతమ్, గైని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపున్న బాధితులు

నిర్ణీత గడువులోపు డిజిటల్ సర్వే పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం చేపట్టిన సర్వే పక్కాగా నిర్వహించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. శుక్రవారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఫ్యామిలీ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ.. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన దానిలో బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆ వార్డులో 270 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 130 కుటుంబాలను సర్వే చేసినట్టు వివరించారు. అలాగే బాన్సువాడ మండలం పరిధిలోని నాగారం గ్రామాన్ని ఎంపిక చేసి నాగారం గ్రామంలో 168 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 106 కుటుంబ సభ్యుల సర్వే చేసినట్టు బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. నాగారం గ్రామంలో సర్వేను పరిశీలించిన ఎంపీడీవో అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు జరిగే సర్వేలో కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టిన తేదీ, వయసు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ తదితర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రోజు కనీసం 50 కుటుంబాలకు సంబంధించి సర్వే పూర్తి చేసి నిర్ణీత గడువులోగా వందశాతం లక్ష్యం చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, మండల గ్రామ పంచాయతీ అధికారి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి, మున్సిపల్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-ఎడపల్లి

ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మండలంలోని జాన్కంపేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు డప్పు సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాన్కంపేట్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బక్కి వెంకటయ్యకు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే జానకంపేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. దండోరా సంఘం సభ్యులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు డప్పు సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా పర్యటనలో భాగంగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల సాంఘిక సంక్షేమ ఎస్సీ ఎస్టీ విభాగంలో సమీక్ష సమావేశానికి వచ్చారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి నిజామాబాద్ జిల్లాలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల గురించి వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ డప్పు సురేష్ మాదిగ, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జి పానుగంటి సాయిలు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తాడెం సాయిలు, నగునూరి రాజశేఖర్, ఎర్రశేఖర్, పి.సాయి చిరు, అలికె సుధాకర్, జాన్కంపేట్ గ్రామ మాదిగ దండోరా సంఘం అధ్యక్షులు కార్యవర్గం సభ్యులు నక్క లింగం, ఎంబ రాజేశ్వర్, సదా సంజీవ్, శీను, పోలీస్ సాయన్న, పెద్ద గంగారాం తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్యకు సన్మానం

విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలి

- వీరాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం
- సొసైటీ చైర్మన్ రాంబాబు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మెన్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలని మిర్జాపూర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు వెన్నం రాంబాబు సూచించారు. శుక్రవారం బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామంలో మిర్జాపూర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు వెన్నం రాంబాబు ఆధ్వర్యంలో బీర్కూర్ నసురుల్లాబాద్ మండలాల యువకుల కోసం ఉమ్మడి మండల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు తీయాలని, భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి బాన్సువాడ నియోజకవర్గానికి మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. దసరా పండగ సందర్భంగా క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదని తెలిపారు. గెలిచామని గర్వపడవద్దని, స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పోసానిపేటలో పశువైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధన శాఖ అధికారి శ్రీనివాస్ హాజరై రైతులతో మాట్లాడుతూ.. గ్రామంలో పశువుల సంఖ్య, సంకరజాతి పశువులు, గ్రామం నుంచి పాల దిగుబడిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంవర్ధన శాఖ ఆధ్వర్యంలో సెక్స్ స్టార్టెడ్ సెమెన్ 90 శాతం విజయవంతం అవుతున్నాయని, రైతులు రూ.250 చెల్లించి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని, 21 రోజుకు మళ్ళీ ఎదో కొస్తే, తిరిగి రూ.250 చెల్లించి రెండవసారి కృత్రిమ గర్భధారణ చేయించాలని, రెండవసారి కూడా విజయవంతం కాకుంటే రైతుకు రూ.500 చెల్లిస్తామని తెలిపారు. మండల పశువైద్యాధికారి రామ్‌చందర్ మాట్లాడుతూ.. శిబిరంలో 19 సాధారణ చికిత్సలు, 52 గర్భకోశ వ్యాధుల చికిత్సలు 10 కృత్రిమ గర్భధారణలు, 45 పశువులకు నట్టల నివారణ చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు సంజయ్ కుమార్, విఎల్‌వో శ్రీనివాసరావు, జెవిఓ నారాయణ, పశువైద్యులు, గోపాల్‌మిత్ర, రైతులు రాములు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయలో సంబురంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ

నవతెలంగాణ-బోధన్

మహిళలు ఎంతో ఆరాధించే బతుకమ్మ పండుగ వేడుకలు శుక్రవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ తూము పద్మ పాల్గొని బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. విద్యార్థులు రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మలు తయారుచేశారు. అందులో గౌరమ్మను పెట్టి సాంప్రదాయబద్ధంగా గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడుతూ సంబరాలు నిర్వహించారు. అలాగే విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా తయారు చేసిన వంటకాలను అతిథులు పరిశీలించారు. ఉత్తమ రుచికరంగా వంటకాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల యాజమాన్యం సూర్యప్రకాశ్, డైరెక్టర్ సునీత, రజిని, శ్రావణి, రోజ రమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఏపి ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న జిల్లా కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ తెలంగాణ, ఇండియన్ అకాడమిక్ ఆఫ్ పీడియాట్రిక్ కామారెడ్డి జిల్లా చారిటీ ఆక్టివిటీ సంయుక్తంగా వైద్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు కామారెడ్డి మెడికల్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులైన ఆరుగురిని గుర్తించి వారికి చెక్కులను పంపిణీ చేసినట్లు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఐఏపి కామారెడ్డి జిల్లా కార్యదర్శి డాక్టర్ విజయరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఐఏపీ ద్వారా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం మెడికల్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి ఆరుగురికి చెక్కులను పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, ప్రొఫెసర్ శ్రీనివాస్ కళ్యాణి, పిల్లల వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర గౌడ్, డాక్టర్ వెంకట్రాజం, డాక్టర్ నరేందర్ రవు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ అరవింద్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ నాగేందర్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డిఎల్పీవో సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మంచినీటి సరఫరా చేసే సహాయకులకు మంచినీటి పరికరాలపై శుక్రవారం రైతు వేదికలో శిక్షణనిచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని లింగంపేట్ రైతు వేదికలో డిఎల్పీవో సురేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కరు లేదా ఇద్దరినీ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేసినట్టు తెలిపారు. నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొదటిరోజు హ్యాండ్ పంపుల వినియోగం వాటి మరమ్మతుల గురించి వివరించారు. హ్యాండ్ పంప్ పనితీరు, వాటి భాగాలు, మరమ్మతులు, ఎలక్ట్రికల్ కంపోనేన్ట్స్‌కు సంబంధించి సింగల్ ఫేస్, 3 ఫేస్ మోటార్ల పనితీరు, వాటి మరమ్మతులు, ప్లంబింగ్ పనులలో భాగంగా కుళాయి నల్లాల రిపేర్లు, పైప్‌లైన్‌లు వాటికి సంబంధించిన మరమ్మతులు, నీటి నాణ్యతలో భాగంగా వాటికి సంబంధించిన పరీక్ష ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం, నీటిని క్లోరినేషన్ చేయడం, వాటిని పరీక్షా చేయడంపై వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈలు, మంచినీటి సరఫరా చేసే సహాయకులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



చెరువులో విఠల్ మృతదేహం

నవతెలంగాణ-పిట్లం

తాగుడుకు బానిసై చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజు కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన జంగం విట్టల్ (37) కూలి పని చేస్తూ జీవనం గడుపుతుండగా గత కొంతకాలంగా తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని తాగుడుకు బానిసై శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని మారేడు చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోచారం హై స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర బాల్ బ్యాట్మెంటన్ శిక్షణ శిబిరం ముగిసిందని, తుది జట్టును ఎంపిక అయిందని నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 4 నుండి 6 తేదీ వరకు ప్రొబేల్స్ హైస్కూల్ కామారెడ్డి జిల్లాలో నిర్వహించే 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, కార్తీక్, అనిల్, శామిందర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి మృతి

సంతాపం తెలిపిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

సీపీఐ(ఎం) చేపూర్ గ్రామ శాఖ కార్యదర్శి సాకలి నర్సయ్య మృతి చెందారు. ఈ సందర్భంగా శుక్రవారం డివిజన్ కార్యర్శి పల్లపు వెంకటేష్. నర్సయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నర్సయ్య కుటుంబా నికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన అందరితో కలిసి మెలసి ఉండే వారని, 15 సంవత్సరాల నుండి పార్టీలో ఉండి సేవలను అందించారని అన్నారు. ఆయన ఆశలను కొనసాగిస్తామని అన్నారు కార్యక్రమంలో సడమస్తుల అశోక్, ఓంకార్, సాయి, గంగుబాయి తదితరులున్నారు.

'బతుకు దెరువు కోసం ఎక్కడికీ వెళ్లద్దు'

నవతెలంగాణ-వర్ని

కొందరు మోస్రా గౌడ కులస్తులు వ్యక్తిగతంగా కక్ష గట్టారని, 12 కుటుంబాలు బతుకు దెరువు కోసం ఎక్కడికి వెళ్లకుండా గ్రామంలోనే ఉండాలని పంజాల మల్లికార్జున గౌడ్, బొజ్జ శేఖర్ గౌడ్, బొజ్జ బాలరాజు గౌడ్, ఏ.రాజేశ్వర్ గౌడ్, పంజాల స్వామి గౌడ్, పంజాల మహేష్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50, 60 సంవత్సరాలుగా తాతలు, తండ్రులు పుట్టి పెరిగిన మోస్రా గ్రామానికి చెందిన గౌడ కుల సంఘ సభ్యుల్లో మొత్తం 76 కుటుంబాల్లో నుండే ట్యాపర్, నాన్ ట్యాపర్‌గా విభజించి ప్రతి యేటా కల్లు మాముల నడుపుచున్నామని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలుగా కుల సంఘంలో కొత్తగా ఏర్పడిన కుల పెద్దలు కొందరు కొత్త కొత్తనిబంధనలు పెట్టుకుంటున్నారని తెలిపారు. వారు తీసుకునే నిర్ణయాల వల్ల మిగితా గౌడ కుటుంబాలవారిని ఇబ్బందులకు గురి చేస్తు, భౌతిక దాడులకు దిగుతు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారు తీసుకునే నిర్ణయాలు తప్పని వారించినందుకు 12 కుటుంబాల్లోని సభ్యులపైన వ్యక్తిగతంగా కక్ష గట్టారని తెలిపారు. బతుకు దెరువు కోసం నిజామాబాద్, పరిసర గ్రామాల్లో పనిచేసుకుంటూ గ్రామంలో జరిగే గౌడ కుల సంఘంలో జరిగే మంచి చెడు వెళ్తున్న తమపై వ్యక్తిగతంగా కక్షతో దుర్భాషలాడుతు, బెదిరింపు చర్యలకు పాల్పడుతు, కేసులు చేయిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బతుకు దెరువు కోసం ఎక్కడికి వెళ్లకుండా గ్రామంలోనే ఉండాలని హుకుం జారి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, పోలిస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఆలూరు నూతన వీడీసీకి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

నూతన ఆలూర్ గ్రామ విడిసి సభ్యులను శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అధ్యక్షులు బార్ల ముత్యం రెడ్డి, ఉపాధ్యక్షులు తిర్మన్‌పల్లి నవనీత్, ఎత్తిన సంతోష్, కోశాధికారి కామని సుమన్, కార్యదర్శులు గంధం రాములు, బంజా జాన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులు ముక్కెర విజయ ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం మల్లారెడ్డి, రాజేందర్, బీరయ్య, కుంట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ఫామ్స్ విడుదల

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అప్లికేషన్ ఫామ్ లను శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ....పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు లో భాగంగా నందిపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది నాగ సురేష్‌ను అసెంబ్లీ పట్టభద్రుల ఎమ్మెల్సీ కో కన్వీనర్‌గా నియమించడం జరిగిందని, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు కావాల్సిన వారు గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు అప్లికేషన్ ఫారంతో ఎస్ఎస్సి సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఓటరు ఐడెంటి కార్డు జిరాక్స్‌తో పాటు డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్‌పైన గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి అప్లికేషన్ ఫామ్‌పై ఫోటోను అతికించి ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. బిజెపి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ, పట్టణ కార్యదర్శి, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ మిరియాల్కర్ కిరణ్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సహ కన్వీనర్ కలిగొట ప్రశాంత్, ఓబిసి మోర్చ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, బీజేవైయం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

- రెండోరోజు కొనసాగిన న్యాయవాదుల ఆందోళన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు న్యాయవాది మహమ్మద్ అబ్దుల్ కలీమ్ పై మాదన్నపేట్ పోలీసుల దాడిని నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ రోజు ఆందోళన కొనసాగింది. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ నాయకత్వంలో న్యాయవాదులు జిల్లాకోర్టు చౌరస్తాకు చేరుకుని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ పోయి, న్యాయవాదుల ప్రాణాలకు ఎసరుపెట్టే పోలీసింగ్ తయారు అయిందని అన్నారు. శాంతియుత వాతావరణం ఏర్పాటు చేయాల్సిన పోలీసు వ్యవస్థ కొందరు పోలీసుల మూలంగా అపఖ్యాతి మూటగట్టుకోవాల్సి రావడం దురదృష్టకరమని తెలిపారు. పోలీసు శాఖలో రాక్షస మనస్తత్వం ఉన్న, పౌరుల హక్కులను గుర్తించని వారిని పోలీసు ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు మాదన్నపేట్ నేరమయ ఘటనకు భాద్యులైన పోలీసులపై డిజిపికి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ ఇంతవరకు స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. తక్షణమే బాధ్యులైన వారిని ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్న దృశ్య న్యాయవాద వృత్తి ప్రత్యేక రక్షణ చట్టాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు,కార్యదర్శి దొన్పాల్ సురేష్, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్,కోశాధికారి దీపక్ న్యాయవాదులు అపూర్వమానిక్ రాజు,ఆశా నారాయణ,అన్వేష్,సృజన్, విజయ్ సామ్రాట్ మధుసూదన్ గౌడ్ విశ్వాక్ సేన్ మధు చుక్కబొట్లరాజు ప్రకాష్, గంగాధర్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- అణగారిన ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వీడీసీలపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్, సీపీల పనితీరు భేష్ చైర్మన్ కితాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను నెల రోజుల్లో పరిష్కరించాలని, అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసుకుని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలలో గడిచిన మూడు,నాలుగు దశాబ్దాల కాలంగా గ్రామాభివృద్ధి కమిటీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం వీడీసీలు కృషి చేయాలని, ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య కలెక్టర్, సీ.పీలకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తోందని తెలిపారు.

ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కాగా, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ చక్కగా పని చేస్తున్నారని జిల్లా ప్రజలలో మంచి పేరు వినిపిస్తోందని ఈ సందర్భంగా చైర్మన్ వారిని అభినందించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి 41 సీఆర్పీసీ కింద పోలీస్ స్టేషన్లకు పిలిపించుకుని స్టేషన్ బెయిల్ ఇస్తుండడం వల్ల అట్రాసిటీ చట్టం నీరుగారిపోయే ప్రమాదం నెలకొందని చైర్మన్ అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో చర్చించామని, ఈ నెలాఖరులో ఢిల్లీకి వెళ్లి కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని, న్యాయశాఖ మంత్రిని కలిసి విన్నవించనున్నామని వెల్లడించారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎస్సీడీఓ బి.నిర్మల, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షునికి ఘన స్వాగతం

- భారీ ర్యాలీ
- పాల్గొన్నమండల నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/ముప్కాల్/డిచ్‌పల్లి

తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్‌కు వచ్చిన సందర్భగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పిసిసి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత మొట్టమొదటిగా నిజామాబాద్ జిల్లాకు రాగా టోల్ ప్లాజా వద్ద గజమాలతో సత్కరించారు. అనంతరం నిజామామాద్ జిల్లా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ కాట్పల్లి నర్సరెడ్డి, కొలి ప్యాక్ మాజీ ఎంపిటిసి మద్దుల రమేష్, నాయకులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లి : స్వాగతం పలుకుతున్న నాయకులు

టీపీసీసీ అధ్యక్షులుగా మొదటి సారి జిల్లాకు విచ్చేసిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అర్గుల్ నర్సయ్య ఘనంగా స్వాగతం పలికారు. ఇందల్‌వాయి టోల్ ప్లాజా వద్ద శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

డిచ్‌పల్లి: టీపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ భాద్యతలను స్వీకరించి మొట్టమొదటి సారిగా జిల్లా కు వచ్చిన సందర్భంగా ఇందల్ వాయి టోల్ ప్లాజావద్ద ఎమ్మెల్యే, నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. డిచ్‌పల్లి, నడ్పల్లి, ధర్మారం (బీ) వద్ద నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో గజమాల, శాలువా, పూలబొకేలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: పీసీసీ అధ్యక్షులుగా నిజామాబాద్ జిల్లా భీంగల్‌కు చెందిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి సొంత జిల్లాకు రావడంతో ఆహ్వానం పలికేందుకు శుక్రవారం ఛలో నిజామాబాద్‌లో ఆహ్వాన సభకు మండలంలోని నాగంపేట్ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం రెడ్డి, నాగంపేట్ ముత్తెన్న, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మృతిచెందిన గణేశ్

మండలంలోని ఉప్లూర్ గ్రామ పరిధిలోని దమ్మన్నపేట గ్రామ శివారులోని ఒడ్డే గుడిసెల బోర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ అనిల్ రెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింత గణేష్ (49) తన మోటార్ సైకిల్ పై ఉప్లూర్ నుండి కమ్మర్‌పల్లి వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో దమ్మన్నపేట గ్రామ శివారులోని ఒడ్డే గుడిసెల బోర్ వద్ద వ్యవసాయ భూముల పక్క నుండి హార్వెస్టర్ నడుపుకుంటూ వస్తున్న డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా ఒక్కసారిగా రోడ్డు పైకి వచ్చాడు. ఉప్లూర్ వైపు రోడ్డుకు హార్వెస్టర్ తిప్పడంతో ఎదురుగా వస్తున్న చింత గణేష్ బైకు హార్వెస్టర్ ముందు భాగానికి తగిలింది. బలంగా హార్వెస్టర్ కు తగలడంతో గణేష్ కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలైన చింత గణేష్‌ను అంబులెన్స్ లో మెట్ పల్లి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గణేష్‌కు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా సుమారు నాలుగు సంవత్సరాల పాటు పనిచేసిన చింత గణేష్ వారం రోజుల క్రితం ఎంపీ అరవింద్ సమక్షంలో బిజెపిలో చేరారు.

గాయపడ్డ ముప్కాల్ ఎంపీడీవో మృతి

నవతెలంగాణ-ముప్కాల్


ఎంపీడీవో (ఫైల్)

సెప్టెంబర్ 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల తోటి కార్యాలయ సిబ్బందితో పాటు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మలేషియాలో ఉప్లూర్ యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


అరవింద్ (ఫైల్)

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన బైరగోని అరవింద్(24) ఐదు రోజుల క్రితం మలేషియాలో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బతుకుదెరువు కోసం సుమారు 8 నెలల క్రితం మలేషియా వెళ్ళిన అరవింద్ గత నెల 29న ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అరవింద్ మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామం చేరుకుంటుందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. అరవింద్ ఆత్మహత్యకు కారణాలు తెలియని కుటుంబ సభ్యులు తెలిపారు.

భగీరథ పైప్‌లైన్‌లీకేజీల బాధ్యత జీపీలదే

- మరమ్మతు కోసం ఎదురుచూడొద్దు :
- డీఈఈ గంగారాం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మిషన్ భగీరథ పైప్ లైన్ల లీకేజీ బాధ్యత గ్రామపంచాయతీలదేనని, మిషన్ భగీరథ పైప్ లైన్ల రిపేరు కోసం ఎదురు చూడవద్దని మిషన్ భగీరథ డిఈఈ గంగారం అన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో మిషన్ భగీరథ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ మంచినీటి సహాయకులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డి ఈఈ గంగారం మాట్లాడుతూ మిషన్ భగీరథ పంపు నుండి అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన నీరును అందిస్తున్నామని, వాటిని గ్రామ మంచినీటి సహాయకులు వారి గ్రామాల వారికి స్వచ్ఛమైన నీరు అందించేందుకు శాయశక్తుల కృషి చేయాలని అన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ లీకేజీ మరమ్మతుల కోసం కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేకంగా మిషన్ భగీరత కోసం నిధులు కేటాయించిందని అట్టి నిధులతో మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయితే ప్లంబర్ కోసం, మెకానిక్ కోసం ఎదురు చూడకుండా స్వయంగా ఆ గ్రామ మంచినీటి సహాయకులు శ్రద్ధ తీసుకొని రిపేర్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ పైప్లైన్ రిపేర్ ఏ విధంగా చేయాలో ప్రాక్టికల్గా చేసి చూపించారు. ఇకనుంచి గ్రామాలలో మిషన్ భగీరథ రిపేర్లు మీరే చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్ర మంలో మిషన్ భగీరథ డి ఈఈ శివకుమార్, ఏఈ మోహన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, చైర్మన్లు రోడ్డ సాయన్న మధు, అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.


రిపేర్ల గురించి చెబుతున్న అధికారులు

చేతికొచ్చిన సోయా.. దండుకుంటున్న దళారులు

- మద్దతు ధరకు అమాంతంగా రూ.500 వరకు కోత
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఆలస్యంగా నేడు ప్రారంభం కానున్న కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-మద్నూర్

సోయా పంట చేతికొచ్చినా.. మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కొనుగోలు బీట్లు జరగడం లేదు. దీంతో అందిందే అవకాశంగా దళారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.4892 నిర్ణయించగా.. ప్రయివేటు వ్యాపారులు మాత్రం రూ.4400-4500 మధ్య కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు సుమారు 500 రూపాయల వరకు రైతులు నష్టపోతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే తాము నష్టపోయే వాళ్లం కాదని వాపోతున్నారు. కాగా నేడు(శనివారం) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

మద్నూర్ మార్కెట్లో ఎలాంటి పంటలు కొనుగోలు జరిగినా అధికారుల ఆధ్వర్యంలో రోజువారి బీట్లు జరగవలసి ఉండగా అలాంటివి ఏమీ జరపకుండా వ్యాపారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యంతో తాము మోసపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సోయా పంట చేతికి వస్తోంది. సర్కారు మద్దతు ధరకు ప్రైవేటు వ్యాపారుల ధరలకు దాదాపు 5 నుండి 6 వందల రూపాయలు తేడా ఉండటం రైతులకు భారీగా నష్టం వాటిల్లుతుంది. రైతులు పండించిన పంట ఏది చేతికి వచ్చిన ఈ మార్కెట్లో రోజువారి బీట్లు జరపకుండానే ప్రైవేటు వ్యాపారులు ఎలా కొనుగోలు జరిపినా మార్కెట్ అధికారులు నిబంధనలు పాటించకపోవడం ఇక్కడ ప్రైవేటు వ్యాపారులదే రాజ్యంగా మారుతోంది. కొనుగోలు జరిపే పంటకు మార్కెట్ తక్ పట్టీలు ఇవ్వరనే ఆరోపణలు వ్యవసాయదారుల్లో వ్యక్తం అవుతుంది. ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసే పంటకు రోజువారి బీట్లు జరిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ రైతులు కోరుతున్నారు.



ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ.వీ.ఎం, వివిప్యాట్ నిల్వ చేసిన గోదామును శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు మదన్ లాల్ జాదవ్ (ఆమ్ ఆద్మీ పార్టీ), ఆర్.సంతోష్ రెడ్డి (బి.జె.పి), కాసీమ్ అలీ (టీ.డి.పి), ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ బాయి, డిప్యూటీ తహసీల్దార్లు ఎన్.అనీల్, బి.ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

వర్షానికి నేలకొరిగిన వరిపంట

- ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతుల పంట పొలాలు నేలకొరిగి నీటిలో మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట నీటమునగడంతో నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. గురువారం రాత్రి రెంజల్ మండలంలో 26.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో చేతికి వచ్చిన పంట నేలమట్టమైందని పలువురు రైతులు పేర్కొన్నారు. నేలవాలిన పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం కోసం జిల్లా అధికారులకు నివేదికను అందచేయాలని రైతులు కోరుతున్నారు.



వర్షానికి నేలకొరిగిన వరిపంట

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం..

- ఉమ్మడి జిల్లాలో ఘన స్వాగతం పలికిన నాయకులు
- ఘనంగా సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా నిజామాబాద్‌కు విచ్చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్‌కు స్వాగతం పలుకుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభకు వివిధ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

బోధన్ : భారీ బహిరంగ సభకు సాలూర మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సభకు తరలిన వారిలో అల్లె రమేష్, జనార్దన్, రావుల లక్ష్మణ్, సాయిలు, సురేష్, బీహరి హన్మండ్లు, రాజాగౌడ్, లైబ్రరీ చైర్మెన్ స్వామిగౌడ్ తదితరులున్నారు.

నిజామాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

నసురుల్లాబాద్ : రాష్ట్ర పీసీసీ పార్టీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎంపికై బాధ్యతలు స్వీకరించి మొదటిసారి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా బాన్సు వాడ నియోజకవర్గస్థాయిలో రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ పట్టణం నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికేందుకు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. అలాగే నసురుల్లాబాద్ మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలకడానికి తరలివెళ్లారు.



బోధన్ : సాలూరా మండలం నుంచి తరలివెళ్తున్న నాయకులు



నసురుల్లాబాద్ : నిజామాబాద్‌కు తరలివెళ్తున్న కాసుల బాలరాజ్, పోచారం భాస్కర్‌రెడ్డి

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, ప్రతాప్‌సింగ్, రాము, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, మిత్రపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ : మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, మహేష్ కుమార్ గౌడ్, పిసిసి అధ్యక్షులు అయిన తర్వాత, స్వంత జిల్లాకు మొదటి సరిగా వస్తున్న సందర్భంగా నిజామాబాద్‌కు తరలివెళ్లారు. తనతో మండల కార్యకర్తలు చాలా కాలం నుంచి సత్సంబంధాలుండడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నూతన పిసిసి అధ్యక్షుడిని సన్మానించిన నాయకులు..

దోమకొండ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద ఆహ్వాన సభ కార్యక్రమం సందర్భంగా మాజీ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతరెడ్డి, సీతారాం మధు, రామస్వామిగౌడ్, గోపాల్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : తెలంగాణ పిసిసి అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి కామారెడ్డి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు గౌడ సంఘం కులస్తులు నూతన టిపిసిసి అధ్యక్షుని మర్యాదపూర్వకంగా కలవడానికి ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, జెడ్పిటిసి ఉషాగౌడ్, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, పోచయ్య, శ్రీనివాస్, సతీష్, పలువురు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నూతన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ టీపీసీసీ హెూదాలో కామారెడ్డి జిల్లాకు తొలిసారిగా వస్తున్న సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమక్షంలో ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆఫీస్ పటేల్, కాశీరాం, పరంధాములు, సంజీవులు, గంగారం తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మొదటిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు కార్యకర్తలు బహిరంగ సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముబీన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, మాజీ అధ్యక్షులు సాయిరెడ్డి, సిహెచ్ రాములు, జావేద్, సాయిబాబాగౌడ్, ధనుంజయ్, లచ్చేవార్ నితీన్, రమేష్‌కుమార్, బి.రవి, షౌకత్, వినోద్, ప్రభాకర్, గైని కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ : మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దోమకొండ నాయకులు



రెంజల్ నుంచి తరలివెళ్తున్న నాయకులు

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్



వైద్యులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం వజ్జపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ దగ్గర పెన్షన్ పంపిణీ తీరు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు మెరుగుపరచాలని, పౌష్టికాహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడుతు మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణం ఎప్పుడో..?



అధ్వాన్నంగా రోడ్డు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల కేంద్రం బస్టాండ్ నుంచి లక్ష్మపూర్ వరకు, లక్ష్మపూర్ నుంచి జలాల్‌పూర్ గ్రామం వరకు డబుల్ రోడ్డు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. చందూర్ బస్టాండ్ నుంచి జలాల్ పూర్ వరకు రోడ్డుపై ఉన్న గుంతలకు వర్షకాలంలో వాహనదారులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆగస్టులో నిర్మాణం చేపడతామని చెప్పినా.. ఎలాంటి పనులు చేపట్టడం లేదు. ఈ రోడ్డు నిత్యం వందల సంఖ్యలో పెద్దపెద్ద వాహనాలు ప్రయాణిస్తాయి. రోడ్డు సరిగా లేకపోవడంతో దుమ్ము ధూళీ వెదజల్లుతోంది. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం



నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

నూతన మార్కెట్ కమిటీ శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. ఈ సమావేశానికి జహీరాబాద్ ఎం.పి సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. అధ్యక్షులుగా సంగ్యనాయక్, ఉపాధ్యక్షులుగా రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులను కార్యదర్శి గంగు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడిన వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు జూకంటి సంగారెడ్డి, జిల్లా సేవదల్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, వివిధ మండలాల అధ్యక్షులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

40 ఏండ్లుగా పార్టీకి సేవ

- ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడి వరకు..
- మచ్చలేని నాయకుడిగా పేరు
- అంచెలంచెలుగా ఎదిగిన గీరెడ్డి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

నమ్మిన సిద్ధాంతం కోసం 40 ఏళ్లుగా సేవ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ జెండా భుజాన మోస్తూ, కష్టనష్టాలను లెక్కచేయకుండా, అధికారం, ప్రతిపక్షం అనకుండా పార్టీ పట్ల విధేయుడిగా పనిచేస్తున్నాని కాంగ్రెస్ నాయకులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన రాజకీయ ప్రస్థానాన్ని నవతెలంగాణతో శుక్రవారం పంచుకున్నారు. ఆ వివరాలు.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో పోసానిపేట గ్రామంలో జన్మించిన మహేందర్‌రెడ్డి పదవతరగతి వరకు కామారెడ్డిలోని బాయ్స్ హైస్కూల్‌లో పూర్తి చేసి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ చదివారు. నాయకత్వ లక్షణాలతో విద్యార్థి నాయకుడిగా 1985లో ఎన్ఎస్‌యుఐ కామారెడ్డి ఇన్చార్జిగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం 1990 వరకు విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. 1990 నుండి 1999 వరకు సదాశివనగర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి, యువతీ యువకులను ఐక్యం చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. షబ్బీర్ అలీకి నమ్మిన బంటుగా పేరున్న మహేందర్‌రెడ్డి.. 1999 నుండి 2002 వరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ క్రీడల సెక్రటరీగా పార్టీకి సేవలందించారు. 2002 నుండి 2007 వరకు సదాశివనగర్ మండల ఇన్చార్జిగా పనిచేశారు. 2007 నుంచి 2011 వరకు మూడు సంవత్సరాలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సెక్రెటరీగా, ఏడు సంవత్సరాలు జనరల్ సెక్రెటరీగా పార్టీలో కొనసాగారు. 2019 నుండి 2024 వరకు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు సేవలు అందించారు. 2022 నుండి కామారెడ్డి జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ అభియాన్ సంఘటన్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. 2023 నుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు మద్దతుగా 1995లో ఉద్యమించి కేసుల పాలయ్యారు. వి.పి.సింగ్ పీఎం సమయంలో మండల బీసీ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడు ఓసి నీ పేద విద్యార్థుల కోసం, విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమాలు నడిపి, కేసులను ఎదుర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉప్పల్‌వాయిలో రైల్ రోకో, సదాశివనగర్‌లో వంటావార్పు కార్యక్రమాల్లో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి. మచ్చలేని నాయకునిగా పనిచేస్తున్న ఆయనకు పార్టీ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా.. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని ఆయన అంటున్నాడు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో..



రాహుల్‌గాంధీతో గీరెడ్డి మహేందర్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- డిఆర్డిఓ పిడి సురేందర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మహిళలు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలని డిఆర్డిఓ పిడి సురేందర్ తెలిపారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో డ్వాక్రా మహిళలకు చేపల పెంపకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో డ్వాక్రా మహిళ సంఘం సభ్యురాలికి 4లక్షల 5వేలు రుణం ఇవ్వడంతో చేపల పెంపకం, కూరగాయల సాగు విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డిఆర్డిఓ పిడి సురేందర్ మాట్లాడారు. మహిళలు వ్యవసాయంతో పాటు చేపలు, తేనెటీగలు, పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, ఆయిల్ ఫామ్ వంటి వాటిని చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. అర్హత గల స్వయం సహాయక సంఘాలకు 20 లక్షల రూపాయల వరకు రుణాలు అందిస్తున్నామని అన్నారు. ఆర్థిక క్రమ శిక్షణతో మహిళలు అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. పొదుపు రికవరీ విషయంలో నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీటిలో చేపల పెంపకంపై రుణాలు అందజేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సామాజిక భద్రతా పథకాలలో చేరి ఆర్థిక భరోసా పొందాలని తెలిపారు. ఈ కార్యకమంలో ఎంపీడీవో భారతి, ఎల్డిఎం రవికాంత్, డీపీఎం రమేష్ బాబ, ఐకెపి ఏపిఎం గంగాధర్, ఇతర అధికారులు రవి విజయ్ సీసీఎస్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల సాగు విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బహిర్భుమికి వెళ్లి.. కుంటలో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల పరిధిలోని కొక్కొండ గ్రామానికి చెందిన కుమ్మరి చింటూ (18) ఈ నెల 3న మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి సాయంత్రం అయినా రాకపోయేసరికి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం అతని తండ్రి కుమ్మరి యాదగిరి ఉదయం అతని కోసం గాలిస్తుండగా గ్రామ శివారులోని మేకల వారికుంటలో తేలుతూ కనిపించాడు. అతడిని ఒడ్డుకు తీసుకురాగా చనిపోయి ఉన్నాడు. మృతుని తండ్రి ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.